క్లుప్తంగా

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

కవిటి: మండలంలోని బల్లిపుట్టుగకు చెందిన బచ్చల తేజ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఇతనికి ఐదుగురు ఆడ పిల్లలు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి. విషయాన్ని తెలుసుకున్న కేశుపురం గ్రామానికి చెందిన శ్రీకాళీ మాత సేవా సమితి అండగా నిలిచింది. రూ. 15 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని సేవా సమితి సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో బాధితుడికి శుక్రవారం అందజేశారు.

సత్వరమే రైతు సమస్యల పరిష్కారం

ఇచ్ఛాపురం రూరల్: భూ సమస్యలు ఉన్నట్లైతే తక్షణమే సంబంధిత అధికారులతో పరిష్కారించడం జరుగుతుందని తహసీల్దార్ ఎన్.వెంకటరావు అన్నారు. గతంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులు, భూ సమస్యలపై శుక్రవారం ఆయన ఈదుపురం, లొద్దపుట్టి గ్రామ సచివాలయాల్లో బాధితులతో మాట్లాడారు.

చెత్త సేకరించకపోతే ఫిర్యాదు చేయండి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని వీధుల్లో డోర్ టూ డోర్ చెత్త సేకరణ పకడ్బందీగా జరుగుతుందని.. ఎవరైనా పారిశుధ్య కార్మికులు రాకపోతే ఫిర్యాదు చేయాలని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. శుక్రవారం 17వవార్డు తిలక్‌నగర్‌లో గార్బేజీ క్లియరెన్సు, 13వవార్డులో బస్టాండ్ పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం 15వ వార్డులో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణపై ఆరా తీశారు. పారిశుధ్య సూపర్‌వైజర్‌లు ఉన్నారు.

రాధాకృష్ణుల ఊరేగింపు



భజనలు చేస్తున్న ఇస్కాన్ సభ్యులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో రాధాకృష్ణుల విగ్రహాలను శుక్రవారం ఊరేగించారు. మధ్యప్రదేశ్ నుంచి పొడవాటి కొమ్ములతో ఉన్న ఎద్దులతో కూడిన రథంలో విగ్రహాలను ఉంచి ఊరేగించగా..ఇవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆస్ట్రేలియా నుంచి వచ్చిన ఈస్కాన్ భక్తులు చేసిన నృత్యాలు భక్తులను అలరించాయి.

ఆదిత్యలో పుస్తకావిష్కరణ

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నూతన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రొఫెసర్లు ఎస్.సాయిబాబు, ఎస్.ఎల్.శ్రీకాంత్ సంయుక్తంగా రాసిన ఇండస్ట్రియల్ మేనేజ్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పేరుతో రచించిన పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ కె.వేణుగోపాల్, బీఎస్ అండ్ హెచ్ ఎం.వి.రత్నమణి, ఎం.రమణయ్య, ఎంబీఏ విభాగం హెచ్ఓడీ వి.శివకుమార్ పాల్గొన్నారు.

పారదర్శకంగా వినతుల పరిష్కారం

కంచిలి: ప్రజల నుంచి వచ్చిన వినతులను పూర్తి పారదర్శకంగా పరిష్కరించేందుకు సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని పలాస ఆర్డీవో వెంకటేశ్వర్లు సూచించారు. జాడుపూడి గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. పీజీఆర్ఎస్(గ్రీవెన్స్)కు సంబంధించిన ప్రక్రియ ఎలా జరుగుతుందనేది జరిగే డ్రైవ్‌లో భాగంగా ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో దీనికి సంబంధించి వచ్చిన వినతులు, పరిష్కారమైనవి, పెండింగ్‌లో ఉన్నవాటి గురించి ఆరా తీశారు. డిప్యూటీ తహశీల్దార్ డి.సంతోష్‌కుమార్, వీఆర్వోలు ఉన్నారు.

వీధికి గణేష్‌నగర్‌గా నామకరణం

ఇచ్ఛాపురం: పురపాలకసంఘం పరిధి ఆస్పత్రి రోడ్డు ఉత్తరవైపు ఉన్న వీధికి గణేష్‌నగర్‌గా నామకరణం చేయడానికి ఆర్‌డీఎంఏ (విశాఖపట్నం) ఆమోదం తెలిపిందని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ శుక్రవారం తెలిపారు. ఇక నుంచి ఉత్తర ప్రత్యుత్తరాలను గణేష్‌నగర్ పేరుమీదుగా కొనసాగించవచ్చని తెలిపారు. బీజేపీ జిల్లా కన్వీనర్ సాయికామేష్, పలువురు నాయకులు కమిషనర్‌కి కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. గణేష్‌నగర్‌కి అవసరమైన పబ్లిక్ కుళాయి, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు

మా దారి..రహదారి!

- రోడ్లపైనే పశువుల సంచారం
- ప్రమాదాలకు గురవుతున్న జనం
- సౌకర్యాలకు నోచుకోని సంరక్షణ కేంద్రం



రోడ్లపై తిరుగుతున్న పశువులు

టెక్కలి రూరల్:

పశువుల యజమానులు వాటి సంరక్షణపై దృష్టి సారించడం లేదు. రోడ్లపై విచ్చల విడిగా వదిలేస్తున్నారు. ఆవులు, గేదెలు విచ్చలవిడిగా తిరుగుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. వాటి వలన వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురౌతున్నారు. అంతే కాకుండా రోడ్ల పక్కన ఉంటున్న దుకాణాల్లోకి చొరబడి కనిపించిన వస్తువులను తినేస్తూ హడలెత్తిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా వాటి యజమానులు మాత్రం తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. నియంత్రించాల్సిన అధికారులు కూడా నామమాత్రపు చర్యలతో చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితి అన్ని ప్రధాన పట్టణాల్లో ఉండగా.. టెక్కలిలో మరీ ఘోరంగా ఉంది. ప్రధాన రహదారుల్లో ఆవులు గుంపులుగా తిరుగుతూ రహదారికి అడ్డంగా పడుకుని ఉంటుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. రాత్రి సమయంలో ప్రయాణాలు చేసే వాహనదారులు రోడ్లపై పడుకుని ఉన్న పశువులను గుర్తించలేక ప్రమాదాలకు గురౌతున్నారు. షాపుల్లోకి చొరబడ కూరగాయలు, వస్తు సామగ్రిని తీసేస్తుండడంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కోసారి పశువులు సైతం పోట్లాడుకుంటూ వచ్చి జనంపై పడుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. చాలామంది గాయపడిన సందర్భాలు కూడా ఉన్నాయి. పక్క రోడ్డు నుంచి సడన్‌గా డివైడర్ల పైనుంచి మరో రోడ్డుపైకి పశువులు వస్తుండడంతో తరచూ వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. అలాగే రోడ్డుపై నడిచి వెళ్తున్న వారిని పశువులు పొడిచి గాయపరిచిన సంఘటనలు ఇటీవల టెక్కలి పట్టణంలో చోటు చేసుకుంది. అయితే అధికారులు విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువులను అరికట్టాలని భావించారు.

కొద్ది నెలల క్రితం టెక్కలిలో ఆవుల సంచా రం నియంత్రణకు గో సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే గో సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదనే వాదన స్థానికంగా వినిపిస్తుంది. దీనికి అధికారుల పర్యవేక్షణ లోపమే ప్రధాన కారణమని స్థానికులు విమర్శిస్తున్నారు.

మౌలిక వసతుల కొరత



మౌలిక వసతుల్లేని గో సంరక్షణ కేంద్రం

స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సమీపంలో ఏర్పాటు చేసిన గో సంరక్షణ కేంద్రంలో ఆవులను ఉంచేందు కు సరైన మౌలిక వసతుల్లేవు. రోడ్లపై విచ్చలవిడిగా సంచరించే పశువులను పట్టుకొని ఇక్కడ ఉంచేందు కు షెడ్లు, మేత సౌకర్యం లేకపోవడంతో పశువుల ను ఉంచేందుకు అధికారులు సతమతమౌతున్నా రు. రానున్నది వేసవి కాలం కావడంతో గోవులు ఉంచేందుకు సంరక్షణ కేంద్రంలో సరైన వసతులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



రోడ్లపై విచ్చలవిడిగా తిరిగే పశువులను పట్టుకొని టెక్కలిలో ఏర్పాటు చేసిన గో సంరక్షణ కేంద్రానికి తరలిస్తున్నాం. సంబంధిత యజమానులకు వెయ్యి రూపాయల వరకూ రుసుం విధిస్తున్నాం. కొంతమంది తమ పశువులను విడిపించి మళ్లీ రోడ్లపైనే విడిచిపెడుతున్నారు. పశువుల సంచారం పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం.

– కె.వి.వి.జగన్నాథం, ఈవో, టెక్కలి మేజర్ పంచాయతీ

విప్లవకారుల ఐక్యత అవసరం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పలాస: పీడిత ప్రజల విముక్తికి విప్లవకారుల ఐక్యత చాలా అవసరమని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ చెప్పారు. బొడ్డపాడు జిల్లా అమరవీరుల స్మారక మందిరం వద్ద శుక్రవారం రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీనానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్నేళ్ల క్రితం కొన్ని అనివార్యకారణాలవల్ల చీలిపోయిన రెండు పార్టీలు ఇప్పుడు ఒకే పార్టీగా రూపాంతరం చెందుతున్నాయన్నారు. అలాగే దేశంలోని అన్ని విప్లవ పార్టీలు కూడా ఒక గొడుగు కిందకు రావాలని, రావాల్సిన అవశ్యకత ఎంతో ఉందన్నారు. విజయవాడలోని రాఘవయ్య పార్కు ఎం.బి.భవన్ ఆడిటోరియంలో ఈ నెల 23న జరగనున్న రెండు పార్టీల విలీనం సభను విజయవంతం చేయాలని కోరారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ నాయకుడు వి.మాధవరావు, ప్రజాసంఘాల నాయకులు గొరకల బాలకృష్ణ, జి.వీరాస్వామి, పోతనపల్లి కుసుమ, బదకల ఈశ్వరమ్మ, కుత్తుం హేమక్క, సార జగన్, బర్ల గోపి ఉన్నారు.

వీవోఏని కొనసాగించాలని విజ్ఞప్తి



వినతి పత్రాన్ని అందజేస్తున్న గ్రామ పెద్దలు

ఇచ్ఛాపురం రూరల్: సన్యాసిపుట్టుగ గ్రామ స్వయం సహాయకశక్తి సంఘాల వీవోఏగా పనిచేస్తున్న ఎం.ఈశ్వరిని కొనసాగించాలని కోరుతూ సెర్ప్ ఏపీఎం ప్రసాదరావుకు గ్రామస్తులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. సంఘ సభ్యుల పట్ల ఈశ్వరి అనుచితంగా ప్రవర్తిస్తుందని, లంచాలు తీసుకుంటుందంటూ ఇటీవల డీఆర్‌డీఏ పీడీకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇటీవల గ్రామంలో విచారణ చేపట్టారు. అందులో భాగంగా గ్రామ మాజీ సర్పంచ్ నీలాపు చంద్రయ్య, పెద్దలు పురుషోత్తం, నీలాద్రి, గ్రామ యువకులు ఎంపీఎంను కలిసి ఆమెను కొనసాగించాలని గ్రామం తరపున వినతిని అందజేశారు.

వైద్య సేవలపై అవగాహన



స్టెమీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

ఇచ్ఛాపురం: గుండెపోటు వస్తే భయపడాల్సిన అవసరం లేదని.. స్టెమీ గుండెకు కవచంలా పనిచేస్తూ రక్షణ కల్పిస్తుందని స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి (సీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ పి.దేవేంద్ర రెడ్డి అన్నారు. ప్రభుత్వం స్టెమీ పేరుతో అందజేస్తున్న అత్యవసర సేవలపై ఆస్పత్రి వైద్యసిబ్బందితో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఎవరైన గుండెపోటుకు గురైనప్పుడు మొదటి గంటకాలం చాలా కీలకమని.. ఆ సమయంలో అవసరమయ్యే పరీక్షలు నిర్వహించి అత్యవసర స్టెమి సేవలను అందజేస్తు రూ. 45 వేలు విలువైన ఇంజెక్షన్‌ను ఉచితంగా వేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్టెమీ గుండెకు భరోసా పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైద్యులు అనూష, శిల్ప ఉన్నారు.

మైనారిటీ మీడియం పాఠశాలలను కొనసాగించాలి



విలీనం చేయవద్దని డిమాండ్ చేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

ఇచ్ఛాపురం టౌన్: రాష్ట్రంలో ఉన్న మైనారిటీ మీడియంలైన ఒడియా, తమిళం, కన్నడ, ఉర్దూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని.. ఈ పాఠశాలలో ఉన్న విద్యార్థులను ఇతర పాఠశాలలో విలీనం చేయవద్దని యూటీఎఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇచ్ఛాపురం పట్టణంలోని మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లాలో ఒడియా మైనారిటీ, అనంతపురం సత్యసాయి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలో కన్నడ మైనారిటీతో ఉర్దూ మైనారిటీ మాధ్యమ విద్యను అభ్యసించే విద్యార్థులున్నారన్నారు. అయితే ఈ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో 3, 4, 5 తరగతులను స్థానిక తెలుగు మాధ్యమం పాఠశాలల్లో విలీనం చేయడం సరికాదన్నారు.

జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు, జిల్లా కార్యదర్శి జి.మాధవరావు, పట్టణ అధ్యక్షుడు ప్రకాశరెడ్డి, సాయికృష్ణ, జేవీవీ మురళీధర్, భాస్కర్, చంటి, సంతోష్, శంకర్ ఉన్నారు.

మార్చి 8న జామి ఎల్లమ్మ జాతర

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో జామి ఎల్లమ్మ జాతరను మార్చి ఎనిమిదో తేదీన నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఎల్లమ్మతల్లి దేవాలయం ప్రధాన అర్చకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏటా లక్షమందికిపైగా భక్తులు జాతరకు హాజరవుతుంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈసారి కూడా అధికసంఖ్యలో భక్తులు హాజరయే అవకాశం ఉందని..అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం

కంచిలి: ప్రభుత్వ పాఠశాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకాన్ని కలిగించేలా ఉపాధ్యాయులు పని చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. విద్యార్థులందర్నీ ప్రభుత్వ బడుల్లోనే చేర్పించడం కోసం ప్రత్యేక కార్యాచరణ తీసుకోవాలని కోరారు. స్థానిక యూటీఎఫ్ ప్రతినిధులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవత్వపు విలువలు పెంచే గుడిలాంటిది బడి అని అన్నారు. అలాంటి బడి కనుమరుగు కాకుండా రక్షించుకోవలసిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని సంస్కరణ పేరుతో ప్రైవేటీకరణ చేసేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని దాన్ని తిప్పికొడుతూ తల్లిదండ్రుల సహకారంతో ప్రభుత్వ బడిని రక్షించుకోవాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్ మాట్లాడుతూ.. ఈ నెల 27వ తేదీన జరగనున్న ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్, వివిధ అధ్యాపక, ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన ఉద్యమ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి



పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న న్యాయమూర్తి కిశోర్‌బాబు

సోంపేట: సోంపేట కోర్టుల సముదాయంలో మార్చి ఎనిమిదో తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ఆరవ అదనపు న్యాయమూర్తి కె.కిషోర్‌బాబు అన్నారు. సోంపేట సర్కిల్ పోలీసు అధికారులతో కోర్టు సముదాయంలో లోక్ అదాలత్‌పై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ వారీగా కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని సూచించారు. లోక్‌అదాలత్ ప్రయోజనాలపై కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు, సోంపేట సీఐ బి.మంగరాజు, ఏపీపీ ఎస్.నరేష్, న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

విద్యావంతునికి సత్కారం



పలాస మండలం నీలావతి గ్రామానికి చెందిన తొలితరం విద్యావంతుడు బచ్చల పాపారావును ఉద్దానం ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో నీలావతి యూవీవీ గ్రంథాలయంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈయన నాటక రంగంలో అంతర్‌రాష్ట్ర స్థాయిలో పేరు ప్రఖ్యాతులు పొందిన కళాకారుడు, గొప్పవాయిద్యకారుడు, వామపక్షభావజాలం గల వ్యక్తని వక్తలు కొనియాడారు. యూవీవీ అభిమానిగా ఎన్నో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారని చెప్పారు. యూవీవీ అధ్యక్షుడు బి.శివప్రసాద్, గౌరవ అధ్యక్షుడు కుత్తుం ప్రకాశరావు, ఉపాధ్యక్షులు పి.గీతమ్మ, జినగ సీతారామయ్య, కె.వినోద్, కె.సుధాకర్, టి.వాసుదేవరావు, కె.లింగమూర్తి, పి.మాధవరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. –పలాస

నూతన కార్యవర్గం..



ఇచ్ఛాపురం మండలంలోని గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న డిజిటల్ అసిస్టెంట్ల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడుగా దుర్గాశి లోకేశ్వరరావు(కేధారిపురం), కార్యదర్శిగా సాడి కృష్ణారావు (కొఠారీ), కోశాధికారిగా కుర్మాన నీరజ (ధర్మపురం), ఆర్గనైజర్ కార్యదర్శులుగా దున్న తారకేశ్వరరావు, చుక్క దీపక ఎన్నికయ్యారు. అనంతరం సంఘ కార్యవర్గ వివరాలతో కూడిన పత్రాన్ని ఎంపీడీవో రామారావుకు అందజేశారు. –ఇచ్ఛాపురం రూరల్

వరుస క్రమంలో చోడి సాగు



కంచిలి మండలం బొగాబెణి పంచాయతీ పరిధి జన్నాఘాయిలో దురాన తులసయ్యకు చెందిన పొలంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో భాగంగా వరుస క్రమంలో చోడి నాట్లు వేసే ప్రక్రియను శుక్రవారం చేపట్టారు. సుమారు 50 సెంట్లలో వరుస క్రమంలో నాట్లను వేశారు. ఈ విధానం వలన రైతులకు ఉపయోగం ఉంటుందని మండల యాంకర్ టి.శివానందం పేర్కొన్నారు. అధిక దిగుబడి, అంతర పంటల వలన ఆదాయం సమకూరుతోందని అవగాహన కల్పించారు ఎకరాకు సుమారు 16 క్వింటాళ్లు వస్తుందని చెప్పారు. ఈ విధంగా నాటడం వలన తెగుళ్లు రాకుండా మంచి దిగుబడి వస్తుందన్నారు. ఐసీఆర్‌పీలు విజయలక్ష్మి, భవాని, మీనా, లీడ్ ఫార్మర్స్ పాల్గొన్నారు. –కంచిలి

బ్యాంకింగ్‌పై అవగాహన



బ్యాంకింగ్ వ్యవస్థపై విద్యార్థి స్థాయి నుంచే అవగాహన కలిగి ఉండాలని ఎల్‌డీఎం ఎం.సూర్యకిరణ్ సూచించారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో బ్యాంకు సేవలపై శుక్రవారం కోటబొమ్మాళి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు లావాదేవీలపై వివరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు, మేనేజర్ వి.అశోక్‌కుమార్, ట్రైనర్ ఎస్.హరి, ఎ.హరనాథ్, బి.అశోక్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎం.అప్పలనాయుడు పాల్గొన్నారు. –టెక్కలి

బదిలీ ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

వజ్రపుకొత్తూరు రూరల్: గరుడబద్ర గ్రామ సచివాలయంలో వివిధ హోదాలలో ఐదేళ్లుగా ప్రజలకు సేవలందించి బదిలీ అయిన ఉద్యోగులు మణికంఠ, శ్రీకర్, స్వాతి, మోహన్, ఊర్వశి, వెంకటరావు, వెంకటేష్‌లను శుక్రవారం ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, తోటి ఉద్యోగులు ఘనంగా సన్మాంచారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామ స్థాయిలో ప్రజలకు సుపరిపాలన అందించాలన్న లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకురావడంతోపాటు ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని అన్నారు. ఉద్యోగులు తన, మన అని తేడా లేకుండా ప్రజలకు సేవలు అందించారని కొనియాడారు. సర్పంచ్ గూడ గిరిజ ఈశ్వరరావు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు కె.మోహన్, జి.భాస్కరరావు, దానేష్, ధర్మారావు, అనంద్ ఉన్నారు.

నిబంధనలకు తూట్లు!

- మద్యం దుకాణాల దరఖాస్తులపై ఆరోపణలు

టెక్కలి: కల్లుగీత కార్మికుల కోసం ప్రభుత్వం సబ్సిడీ రూపంలో కేటాయించిన మద్యం దుకాణాల విషయంలో ఇటీవల జరిగిన దరఖాస్తుల ప్రక్రియలో టెక్కలి ఎక్సైజ్ శాఖ పరిధిలో నిబంధనలకు తూట్లు పొడిచారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టెక్కలి ఎక్సైజ్ శాఖా కార్యాలయం పరిధిలో టెక్కలి, నందిగాం మండలాల్లో కల్లు గీత కార్మికుల కోసం ఆయా రిజర్వేషన్ల ప్రాప్తికి ఇటీవల దరఖాస్తులను ఆహ్వానించారు. టెక్కలి మండలం నుంచి పది, నందిగాం నుంచి 11 మంది దరఖాస్తులను చేసుకున్నారు. అయితే సబ్సిడీ దుకాణానికి సంబంధించి అర్హులైన కల్లుగీత కార్మికులు దరఖాస్తులు చేసుకునే క్రమంలో ప్రస్తుతం ఉన్నటువంటి కొంతమంది ప్రైవేట్ లైసెన్స్ దుకాణదారులు ఎక్సైజ్ అధికారుల సలహాలతో చక్రం తిప్పారనే విమర్శలు వస్తున్నాయి. ఎలాగైనా సబ్సిడీ దుకాణాలను తమకు అనుకూలంగా దక్కించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కొంతమంది ప్రైవేట్ లైసెన్స్ దారుల బ్యాంకు ఖాతాల నుంచి డీడీలను తీసి మరీ దరఖాస్తులు చేయించినట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వం కల్లు గీత కార్మికులకు ఇచ్చిన సబ్సిడీ అవకాశం పక్కదారి పట్టాయనే విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రస్తుతానికి దుకాణాల కేటాయింపు ప్రక్రియ వాయిదా పడినప్పటికీ దరఖాస్తుల ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడిచారంటు స్థానికులు చర్చించుకుంటున్నారు. దీనిపై లోతుగా విచారణ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో చివరి రోజున కోటబొమ్మాళి ఎక్సైజ్ కార్యాలయం వద్ద చిన్నపాటి వాగ్వివాదం జరిగినట్లు సమాచారం. ఈ విషయాన్ని ఎక్సైజ్ సీఐ షేక్ మీరా సాహెబ్ వద్ద ప్రస్తావించగా.. నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తులు ప్రక్రియ జరిగిందన్నారు.

పుల్వామా అమరులకు ఘన నివాళులు

పుల్వామా ఉగ్రదాడి జరిగి శుక్రవారానికి ఆరేళ్లయింది. ఈ సందర్భంగా అమరులైన జవాన్లను స్మర్మించుకుంటూ విద్యార్థులు, యువకులు, యువజన సంఘాల సభ్యులు కొవ్వొత్తులతో శాంతిర్యాలీలు చేశారు. ముష్కరుల దాడిలో అమరులైన 40 మంది సైనికుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. జవాన్ల త్యాగాన్ని స్మరించుకున్నారు.

–సాక్షి నెట్‌వర్క్



కంచిలి: బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో వీర జవాన్లకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు



కవిటి: పెద్ద ఎర్రగోవిందపుట్టుగ పాఠశాలలో అమరులకు నివాళులర్పిస్తూ..



ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం బస్టాండ్‌లో కొవ్వొత్తులతో వీరజవాన్లకు నివాళులర్పిస్తున్న యువకులు